విశాలాంధ్ర కథనానికి స్పందించిన అధికారులు

విశాలాంధ్ర - అనందపురం : అనందపురం మండలం రామవరం పంచాయతీ పరిధిలో సర్వేనెంబర్ 86 కొత్తచెరువు మట్టి అక్రమాలపై శుక్రవారం విశాలాంధ్ర పత్రికలో ప్రచురించిన పత్రిక కథనానికి తాసిల్దార్ శ్యాం ప్రసాద్ ఆదేశాల మేరకు స్థానిక ఆర్ఐ రీటా, విఆర్ఓ వరహాలు, విలేజ్ సర్వే స్థలాన్ని పరిశీలన చేశారు, చెరువుగట్టు, మట్టి తీయడంపై ప్రైవేట్ స్థలానికి రోడ్డు వేయడంవివరాలు సేకరించి నివేదిక అందిస్తామని అక్రమాలకు పాల్పడుతున్న వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని రెవిన్యూ అధికారులుతెలిపారు.

మోడీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలు తిప్పికొట్టండి

సీపీఐ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు

విశాలాంధ్ర - విశాఖ : ప్రధానిగా మోడీ అధికారం చేపట్టిన నాటి నుంచి దేశం అన్ని రంగాల్లో వెనుకబాటు పట్టిందని సీపీఐ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు విమర్శించారు. జీవీఎంసీ 7వ వార్డు మల్లయ్యపాలెంలో శుక్రవారం మోడీ ప్రజా వ్యతిరేక పాలనపై ఇంటింటికీ కరపత్రాలు పంచుతూ ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సామాన్యులు జీవించలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. నిత్యావసరాల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయన్నారు. పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరల పెరుగుదలకు హద్దు లేదని అంతకు ముందు రూ.70 ఉన్న పెట్రోలు రూ.112లకు, రూ.52 ఉన్న డీజిల్ రూ.100కు పైగా పెరిగిందని తెలిపారు. చంద్రబాబు సీఎంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్నా ఎన్నికల్లో ఇచ్చిన కీలకమైన హామీలేవీ అమలు చేయలేదన్నారు. ప్రతి విద్యార్థికి ఏటా రూ.15 వేల కింద ఇస్తామన్న తల్లికి వందనం, రైతులకు ప్రతి ఏటా ఇస్తామన్న రూ.20 వేలు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఆడబిడ్డ నిధి కింద ప్రతినెలా రూ.1500, నిరుద్యోగ భృతి రూ.3000 వంటి సూపర్ సిక్స్ హామీలు ఎప్పటి నుంచి అవుతాయో చెప్పలేని స్థితి ఉందన్నారు. కొత్త పాలసీ రూపంలో ఊరూరా మద్యం ఏరులై పారుతోందని విమర్శించారు. సీఎం హోదాలో చంద్రబాబు తొలి సంతకం చేసిన డిఎస్సీ పోస్టుల భర్తీ అనుమానాస్పదంగా ఉందన్నారు. ఈ నేపథ్యంలో విప్లవవీరులు భగత్ సింగ్, రాజగురు, సుఖదేవ్ ల వర్ధంతి మార్చి 23 నుండి భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ జయంతి ఏప్రిల్ 14 వరకూ దేశ వ్యాప్తంగా వివిధ రూపాల్లో సీపీఐ ప్రచార ఆందోళనలకు శ్రీకారం చుట్టిందన్నారు. అందులో భాగంగా ఏప్రిల్ 11న జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద భారీ బహిరంగ సభలో సీపీఐ జాతీయ కార్యదర్శి కామ్రేడ్ కె.నారాయణ పాల్గొంటారని తెలిపారు. ప్రజల్లో చైతన్యం నింపడం కోసం చేపట్టిన ఈ ప్రచార ఆందోళనలను విజయవంతం చేయాలని విశాఖ జిల్లా ప్రజానీకానికి విజ్ఞప్తి చేశారు. ఈ ప్రచారంలో సిపిఐ నాయకులు కె.జగ్గాస్వామి, కె.రాం మహేష్, ఎన్.త్రినాథ్, కె.రామయ్యమ్మ తదితరులతో పాటు గ్రామంలో మహిళలు పాల్గొన్నారు.

గడువులోగా కళ్యాణ మండపం పునర్ నిర్మాణ పనులు పూర్తి చేయాలి

వీఎంఆర్డీఏ చైర్ పర్సన్ ప్రణవ్‌గోపాల్

విశాలాంధ్ర - విశాఖ : ఎంవీపీ కాలనీ సెక్టార్ 1లో వీఎంఆర్డీఏ కళ్యాణ మండపం పునర్ నిర్మాణ పనులను గడువులోగా పూర్తి చేయాలని చైర్ పర్సన్ ఎంవి.ప్రణవ్ గోపాల్ ఆదేశించారు. కళ్యాణ మండపం పనులను శుక్రవారం పరిశీలించారు. శాసన సభ్యులు వెలగపూడి రామకృష్ణ బాబు సూచనల మేరకు స్థానికుల సౌకర్యార్థం కళ్యాణ మండపాన్ని ఆధునీ కరిస్తున్నామని చెప్పారు. సామాన్య ప్రజలకు అందు బాటులో ఉండే ఈ కళ్యాణ మండపం నిర్మాణ నాణ్యతలో రాజీ వద్దని సూచించారు. ఏసీ సదు పాయం కల్పించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చెయ్యాలని సూచించారు. ఈ నెలాఖరునాటికి అన్ని పనులూ పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని అధి కారులను ఆదేశించారు. పార్కింగ్ కోసం స్థలం కేటాయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కమిషనర్ కె.రమేష్, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

బస్ స్టేషన్‌లో టాయిలెట్స్ ప్రారంభం

విశాలాంధ్ర- సింహాచలం : గ్రేటర్ విశాఖ 98వ వార్డ్ పరిధిలో ఉన్న ఏపీఎస్ఆర్టీసీ రీజనల్ మేనేజర్, విశాఖపట్నం బి.అప్పల నాయుడు సింహాచలం బస్ స్టేషన్‌లో టాయి లెట్స్ ఆధునికరణ చేసి వాటిని ప్రయాణికులకు ప్రవేశానికి అనుమతించారు. చాలా రోజుల నుండి సింహాచలం బస్ స్టేషన్ లో ఆధునీకరణ చేయమని ప్రయాణికులు సిబ్బంది విజ్ఞప్తి చేయగా అప్పలనాయుడు రీజనల్ మేనేజర్ చొరవ తీసుకొని స్వర్ణాంధ్ర స్వచ్ఛంద్రలో శుభ్రత పెంచుతూ సింహాచలం బస్ స్టేషన్ భక్తులకు టాయిలెట్ సదుపాయము ఆధునీకరణ చేయించి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సింహాచలంలో ఈనెల 30వ తారీఖున చందనోత్సవం సందర్భంగా శ్రీ వరాహ లక్ష్మీ నారసింహ స్వామి వారి చందనోత్సవం కలెక్టర్ ఆదేశి ప్రకారంగా ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా సిబ్బంది సేవలందిస్తూ మార్గమధ్యలో ఎటువంటి రిపేర్లు జరగకుండా ఎప్పటినుండి మెరుగువరచాలని మెకానికల్ సిబ్బందికి డ్రైవర్ స కండక్టర్లకు గేట్ మీటింగ్ ద్వారా ఆదేశించారు. అదేవిధంగా సింహాచలం బస్ స్టేషన్ లో పెయింట్స్ బల్లలు అందిస్తూ చేస్తూ ఈ బస్ స్టేషన్ లో ఏపీఎస్ఆర్టీసీ పార్సెల్ సర్వీస్ ని కూడా వినియోగించుకోవాలని ప్రయాణికులకు విజ్ఞప్తి చేసి ఉన్నారు. భద్రాచలం కు ఐదు ఆరు తారీకుల్లో శ్రీరామ నవమి సందర్భంగా ద్వారకా బస్ స్టేషన్ నుండి ప్రయాణికులు బట్టి స్పెషల్ బస్సులు కూడా నడుపు తున్నాయని ఈ సందర్భంగా తెలియ జేసెసారు ఈ కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజనీర్ డిపో మేనేజర్ సింహాచలం కె.రాజశేఖర్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, నరసింహారావు, అసిస్టెంట్ ఇంజనీర్ కొండలరావు, సూపర్వైజర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

ఏపీలో అధికారం మారలేదని భ్రమలో బ్రతుకుతున్నారా...!

విశాలాంధ్ర - కొమ్మాది : కొందరు ప్రబుద్ధులు ఏపీలో ఇంకా అధికారం మారలేదని భ్రమలో బ్రతుకు తున్నారని, ప్రజలు ఇచ్చిన తీర్పును సైతం పట్టించుకోవడం లేదని, ప్రజలు ఛీ కొట్టిన మీ పందా మారదా అని విశాఖ పార్ల మెంటరీ కమిటీ అధికార ప్రతినిధి, రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి శ్రీనివాస్ ఎద్దేవా చేశారు. ఆయన శుక్రవారం మీడియాతో మాట్లా డుతూ ఆంధ్ర ప్రదేశ్‌ను స్వర్ణాంధ్ర వైపు నడిపిస్తున్న కూటమి ప్రభుత్వంపై ఇప్పటికీ కూడా మీ నోటికి వచ్చినట్టు మాట్లాడడం అంబటి రాంబాబు కు తగ్గలేదని, వారి సొంత పత్రిక, ఛానల్‌లో ఈరోజు ఆయన మతి భ్రమించి మాట్లాడుతూ మా యువ నాయకులు ఐటీ శాఖ మంత్రివర్యులు లోకేష్ బాబు గురించి నోటికి వచ్చినట్టు మాట్లాడు తున్నారని, కూటమి నాయకులు రోడ్డు మీదకు వస్తే మీ పని అయిపోతుంది విధ్వంసాలను రెచ్చగొట్టేలా మాట్లాడే విధానాన్ని దాసరి శ్రీనివాస్ దుయ్య బట్టారు. ప్రజల సమస్యలపై అసెంబ్లీకి రాని మీ నాయకుడు సొంత ఛానల్‌లో గూడుపుఠాణి చేస్తున్నారని దాసరి శ్రీనివాస్ దుయ్యబట్టారు. అంబటి రాంబాబుని మాటలు వింటుంటే ఉట్టికి ఎగనోడు స్వర్గానికి ఎగుణ అనే సామెత సరిపోతుందని, లోకేష్ బాబు అధికారం చూసి మీరు మాట్లాడుతున్నారా అధికారం ఆ కుటుంబానికి కొత్త కాదని నారా చంద్రబాబు నాయుడు నాలుగవసారి ముఖ్యమంత్రి అని,మీమోసపూరిత వాగ్దానాలకు నమ్మి ప్రజలు ఒక్కసారి అవకాశం ఇస్తే రాష్ట్రాన్ని నాశనం చేసిన మీరు ఈరోజు అభివృద్ధి గురించి పథకాల గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని దాసరి శ్రీనివాస్ అన్నారు. ఇరిగేషన్ మంత్రిగా మీకు టి.ఎం.సి.కి డీఎంసీకి తేడా తెలియని మీరు ఇరిగేషన్ మంత్ర అని మీలాంటి తప్పుడు మంత్రులవల్లే 152నుంచి11 సీట్లకు పడిపోయారు. రాంబాబు గారు ఇప్పటికైనా మాటలు తగ్గించుకోవడం మంచిదని, మీ నాయకుడు ఇంటిలో ఉన్న రోడ్డు మీదకు వచ్చినా ఒకటే. ముందు అసెంబ్లీకి రండి ప్రజాసమస్యల మీద పోరాడండి అని హితవు పలికారు.

బీజేపీ ప్రజావ్యతిరేక పాలనపై 11న బహిరంగ సభ

సీపీఐ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు

విశాలాంధ్ర - విశాఖ : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ ప్రజావ్యతిరేక పాలనపై 11న జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద తలపెట్టిన భారీ బహిరంగ సభను జయ ప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్య దర్శి మరుపిళ్ల పైడిరాజు విజ్ఞప్తి చేశారు. అల్లిపురంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో మోడీ ప్రజా వ్యతిరేక పాలనపై ముద్రించిన కరపత్రాన్ని శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సభలో సిపిఐ జాతీయ కార్యదర్శి కామ్రేడ్ కె. నారాయణ పాల్గొంటారని తెలిపారు. విప్లవవీరులు భగత్ సింగ్, రాజగురు, సుఖదేవ్‌ల వర్ధంతి మార్చి 23 నుండి భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ జయంతి ఏప్రిల్ 14 వరకూ దేశ వ్యాప్తంగా వివిధ రూపాల్లో సిపిఐ ప్రచార ఆందోళనలకు చేపట్టిందన్నారు. ప్రజల్లో చైతన్యం నింపడం కోసం చేపట్టిన ఈ ప్రచార ఆందోళనలను విజయవంతం చేయాలని విశాఖ జిల్లా ప్రజానీకానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు ఎ.విమల, కె.సత్య నారాయణ, ఎస్‌కె.రెహమాన్, పి.చంద్రశేఖర్, ఎం.మన్మథరావు, ఆర్ శ్రీనివాసరావు, సిఎన్ క్షేత్రపాల్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ రుణాల దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు నిర్వహణ

విశాలాంధ్ర - అనందపురం : ఆనందపురం మండలంలోని వేములవలస, ఆనంద పురం, వెల్లంకి, చందక గ్రామ పంచాయతీల పరిధిలోని కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి 4 ఏప్రిల్ శుక్రవారం ఇంటర్వ్యూలు నిర్వహించబడ్డాయి. ఈ ఇంటర్వ్యూలకు మొత్తం 203 మంది దరఖాస్తుదారులు హాజ రయ్యారు. హాజరు కాని దరఖాస్తుదారులు, అలాగే ఆనందపురం మండలంలోని మిగిలిన గ్రామ పంచాయతీల పరిధిలోని దరఖాస్తుదారులందరూ సోమవారం, 7 ఏప్రిల్ 2025న మండల ప్రజా పరిషత్ కార్యాలయం, ఆనందపురం మీటింగ్ హాల్‌లో జరిగే ఇంటర్వ్యూలకు హాజరుకావాలని, 7 ఏప్రిల్ 2025న జరిగే ఇంటర్వ్యూలలో ఎంపీడీవో వి.జానకి, ఏపీజీవీబీ (సొంట్యం, వేములవలస), బ్యాంక్ ఆఫ్ బరోడా (వేములవలస), బ్యాంక్ ఆఫ్ ఇండియా (గిడిజాల), ఇండియన్ బ్యాంక్ (గంభీరం), స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (సొంట్యం, వెల్లంకి), యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆనందపురం) బ్యాంకుల ప్రతినిధులు పాల్గొంటారని ఎంపీడీవో తెలిపారు. ఆనందపురం మండలంలో కార్పొరేషన్ రుణాల కోసం ఆన్‌లైన్ ద్వారా మొత్తం 848 దరఖాస్తులు అందాయని ఎంపీడీవో వి. జానకి తెలిపారు.

సాధారణ ప్రసవమే బిడ్డలకు శ్రేయస్కరం

విశాలాంధ్ర - పెందుర్తి : సిజేరియన్ ద్వారా కాకుండా సాధారణ ప్రసవాలతో బిడ్డలను కనడం ఉత్తమమని పెందుర్తి ఏరియా ఆసుపత్రి ప్రసూతి వైద్య నిపుణులు డాక్టర్ అరుణ దేవి తెలిపారు. పెందుర్తి కమ్యూనిటీ హెల్త్ సెంటర్ సూపరింటెంట్ డాక్టర్ అవంతి అధ్యక్షతన ప్రసవాలకు సంబంధించి ప్రజలకు అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వ హించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సాధారణ కానుకతో తల్లి బిడ్డ మధ్య అనుబంధం పెరుగుతుందన్నారు. పుట్టిన వెంటనే బిడ్డకు తల్లిపాలు ఇచ్చే అవకాశం ఉంటుందని, తద్వారా బిడ్డకు రోగ నిరోధక శక్తి పెరుగుతుందని, తల్లి బిడ్డను త్వరగా ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ చేయవచ్చని తెలిపారు. సిజేరియన్ చేయించుకున్న వాళ్ళు ఎక్కువ రోజులు ఆసుపత్రిలోనే ఉండాల్సిన అవసరం ఉంటుందని, సాధారణ కాన్పు కోసం గర్భిణీలను ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకు రావాలని సూచించారు. ప్రభుత్వం అందజేస్తున్న పథకాలపై అవగాహన పెంచుకుని సద్వినియోగం చేసుకోవాలన్నారు ఈ కార్యక్రమంలో పెందుర్తి ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాన్స్ పాండర్స్ బోట్ల వినియోగంపై అవగాహన

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్ : ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం క్రింద ప్రభుత్వం మొదటి విడతగా ఫిషింగ్ హార్బర్, విశాఖపట్నంలో గల మెఖనైజ్డ్ ఫిషింగ్ బోట్ల కు 618 ట్రాన్స్ పాండర్స్ 100 శాతం సబ్సిడీ పై సరఫరా చేయడం జరిగిందని జె.డి.ఫిషెరీస్,పి. లక్ష్మణరావు తెలిపారు.. ట్రాన్స్ పాండర్స్ వినియోగం, పనితనం పై మరపడవల యజమానులు, డ్రైవర్స్ తో శుక్రవారం ఫిషింగ్ హార్బర్ నందు సమావేశం నిర్వహించారు. ట్రాన్స్ పాండర్స్ ఉపయోగించేటప్పుడు వచ్చేబ్యాటరీ సమస్యలు కమ్యూనికేషన్‌కు సంబందించి అంశాలపైన అవగాహన కల్పించారు. బోటు యజమానులు, సంఘ ప్రతినిధులు ఎమ్. లక్ష్మణ రావు, సి. హెచ్. వీర్రాజు, ఎస్.నర్సింగ రావు, ఎమ్. బాలాజీ, చిన్న, . రాము, కాకినాడ కు చెందిన బోటు యజమానులు శ్రీనివాస్ రాజు ట్రాన్స్ పాండర్స్ వినియోగంలో వచ్చే సమస్యలు వివరించి వాటిని అధిగమించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జేడీ పి.లక్ష్మణరావు మాట్లాడుతూ ట్రాన్స్ పాండర్స్ వలన సముద్రంలో బోటు ఉన్న స్థానం తెలుసుకొనుటకు, చేపల లభ్యత, బోటు ప్రమాదంలో ఉన్నప్పుడు సమాచారం తెలియజేయుటకు అవకాశం ఉంటుందని ఈ పరికరాలను సక్రమంగా వినియోగించుకోవాలని మత్స్యకారులకు సూచించారు. కార్యక్రమానికి షార్ సైంటిస్ట్‌లు సునీల్‌కుమార్, పలాష్ జోషి, ఎన్.ఎస్. ఐ.ఎల్.శాస్త్రవేత్త రాఘవేంద్ర, అవాంటెల్ టెక్నీషియన్స్ సత్యన్నారాయణ, రవికుమార్, ఎఫ్.డి.ఓ. ఆశాజ్యోతి, అనురాధా (కాకినాడ), విశాఖపట్నం, కాకినాడ జిల్లాలకు చెందిన మరపడవల యజమానులు, ఆపరేటర్స్ పాల్గొన్నారు.

బాధితురాలు దీపికకు సందీప్ పంచకర్ల పరామర్శ

విశాలాంధ్ర - కొమ్మాది : మధురవాడ స్వయం కృషి నగర్‌లో ప్రేమోన్మాది నవీన్ దాడి ఘటనలో తీవ్రంగా గాయపడి విశాఖ మెడికవర్ ఆసుపత్రిలో చికిత్స పొందు తున్న నక్కా దీపికను జనసేన భీమిలి ఇంచార్జ్ సందీప్ పంచకర్ల పరామర్శించారు. దీపిక ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. దాడికి పాల్పడిన నిందితుడు ఇప్పటికే రిమాండ్‌లో ఉన్నాడని, నిందితుడిపై విచారణ చేసి ప్రభుత్వం శిక్షిస్తుందని చెప్పారు. దీపికకు జనసేన పార్టీ అండగా ఉంటుందని, వారి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. దీపికకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను సందీప్ కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు శాఖరి శ్రీనివాస్, దేవర శివ, పోతిన అనురాధ తదితులు పాల్గొన్నారు.

బడుగు వర్గాల ఆశాజ్యోతి బాబు జగ్జీవన్ రామ్

విశాలాంధ్ర - కొమ్మాది : తస్వయం కృషితో ఉన్నత స్థానాలను అలంకరించిన నేత, బడుగు వర్గాల ఆశాజ్యోతి బాబు జగ్జీవన్ రామ్ అని చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విద్యార్థులకు తెలియజేశారు. ఏప్రిల్ 5న ఆయన జన్మదిన పురస్కరించుకొని పాఠశాలలో శుక్రవారం జగజీవన్ రామ్ జయంతోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉప ప్రధాని గానే కాకుండా ఐదు దశబ్దాలు పార్లమెంటు సభ్యునిగా కేంద్ర మంత్రిగా వివిధ మంత్రిత్వ శాఖలో పనిచేసే దేశానికి అపారమైన సేవలు అందించారని కొనియాడారు. స్వాతంత్ర పోరాటంలో కూడా ఉద్యమాల్లో పాల్గొన్నారు. నిమ్న కులస్తుడు అయినందున చదువుకునే అవకాశాలు లేని సమయంలో కూడా విద్యపై ఆసక్తి కలిగి అస్పృశ్యతను ఎదిరించి విద్యను అర్జించిన మేధావి అని అన్నారు. చంద్రంద్రంపాలెం పాఠశాల విద్యార్థులకు బాబు జగ్జీవన్ రామ్ జీవితంలోనే ఘట్టాలను చదివి వినిపించారు. ముందుగా ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మోహన్ కుమార్, నాగేంద్ర, సుబ్బలక్ష్మి, నాగమణి, పద్మావతి, లివింగ్ స్టన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేస్తున్న ఎన్డీయే ప్రభుత్వం

విశాలాంధ్ర - మల్కాపురం : భారత కమ్యూనిస్టు పార్టీ శాఖ సమావేశాల్లో భాగంగా మల్కా పురం శాఖ సమా వేశాన్ని శుక్రవారం మల్కా పురం గ్రామ మండలిలో బి.హరినాథ్ అధ్యక్షతతో జరగగా ఈ కార్యక్రమానికి సీపీఐ విశాఖ జిల్లా కార్యవర్గ సభ్యులు కాంద్రేఖ సత్యాంజనేయ, కొడాలి రాంబాబు పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు వ్యక్తులకు ధారాధత్వం చేస్తుంది ఎన్డీఏ ప్రభుత్వం ఎలక్షన్ ముందు ఇచ్చిన వాగ్దానాలు పక్కన పెట్టి సంవత్సరానికి రెండు కోట్లు ఉద్యోగాలు ఇస్తానన్న నరేంద్ర మోడీ ప్రభుత్వం ఉద్యోగాలే లేకుండా చేస్తుంది ఉన్న స్టీల్ ప్లాంట్‌ని ప్యాకేజీ తో సరిపెట్టి పర్మినెంట్ కార్మికులకు విఆర్ స్కీమ్ పెట్టి బెదిరించడం అన్యాయం అన్నారు నేటికీ స్టీల్ ప్లాంట్ కోసం నిరాహార దీక్షలు సంవత్సరాలకు చేస్తున్న ఎన్డీఏ కూటమి ప్రభుత్వానికి కనిపించలేదని హెచ్చరించారు భారత కమ్యూనిస్టు పార్టీ సీపీఐ శత వార్షికోత్సవ సందర్భంగా పార్టీ శాఖ మహాసభలో జరుపుకోవడం జరుగుతుంది ఈ సందర్భంగా ఏప్రిల్ 11వ తేదీ సాయంకాలం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద బహిరంగ సభ జరుగుతుంది ఈ బహిరంగ సభకు పారిశ్రామిక ప్రాంతంలో ఉన్న పార్టీ సభ్యులు సానుభూతిపరులు హాజరుకావాలని మరియు ఈ బహిరంగ సభకు జాతీయ కార్యదర్శి కె నారాయణ గారు మరియు పార్టీ సహాయ కార్యదర్శి జెవి సత్యనారాయణ మూర్తి హాజరవుతున్నారు భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ గాంధీ గ్రామ్ శాఖ సమావేశం నాకు హాజరైన సభ్యులు బి.సురేష్ మధుసూదన్‌రావు బి.హరినాథ్ ఎస్.అప్పారావు హాజరైనారు.

హనుమాన్ బైక్ ర్యాలీపై సమావేశం

విశాలాంధ్ర - ఆనందపురం : ఆనంద పురం శుభశ్రీ కళ్యాణ మండపంలో హనుమాన్ బైక్ ర్యాలీ పై హనుమాన్ విజయోత్సవ ర్యాలీ కమిటీ సభ్యులు ప్రత్యేక సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ మేరకు విశాఖ జిల్లా హనుమాన్ ఉత్సవ కమిటీ నిర్వహణ ప్రతినిధి నర్సింగ్ రావు మాట్లాడుతూ ఈనెల 12న ఆర్కే బీచ్ లో జరగనున్న శోభాయాత్ర, బైక్ ర్యాలీ వేర్వేరు ప్రాంతాల నుంచి ప్రారంభమవుతుందన్నారు. బైక్ ర్యాలీకి సంబంధించి ఆనందపురం పద్మనాభం భీమిలి గ్రామీణ మండలాల నుంచి పెద్ద ఎత్తులో యువత పాల్గొవాలని అందుకు తగ్గ కార్యాచరణ చేయాలన్నారు. భారీ ఎత్తున యువత హనుమాన్ భక్తులు ర్యాలీకి వచ్చే విధంగా గ్రామాల్లో కమిటీలు వేయాలన్నారు. గ్రామాల్లోని దేవాలయాలు, అయ్యప్ప, దుర్గమ్మ పీఠాల ప్రతినిధులతో మాట్లాడి ఎక్కువ మంది హనుమాన్ జయంతి రోజున బైక్ ర్యాలీలో పాల్గొనేటట్టుగా చేయాలన్నారు. దీనికోసం సోషల్ మీడియా పత్రికలు ద్వారా ప్రజల్లోకి వెళ్లాలన్నారు. ఆనందపురంలో ప్రారంభం కానున్న బైక్ ర్యాలీ ఈనెల 12న గ్రామీణ పనుల నుంచి చేసినటువంటి భక్తులందరూ ముందుగా ఆనందపురం కూడలిలో ద్విచక్ర వాహనాలతో కలిసి, అందరూ మధ్యాహ్నం మూడు గంటలకు ఆనందపురం జంక్షన్ నుంచి బయలుదేరేటట్టుగా ప్రణాళిక వేశామన్నారు. అందుకోసం బయట వచ్చే భక్తులంతా గాయత్రి డిగ్రీ కాలేజ్ వద్ద సమావేశం కావాలన్నారు. కళాశాల వద్ద అల్పాహారం తీసుకొని మధ్యాహ్నం మూడు గంటలకు బైక్ ర్యాలీ ప్రారంభం అవుతుందని నిర్వాహకులు వెల్లడించారు. ఈ కార్యక్రమం లో యావత్ భక్తులంతా పాల్గొంటున్నారు. సమావేశంలో హనుమాన్ విజయోత్సవ ర్యాలీ కమిటీ సభ్యులు, మూడు మండలాల నుంచి విచ్చేసినటువంటి హనుమాన్ భక్తులు పాల్గొన్నారు.

భీమిలిలో వీసీసీ, ఎస్ఎఫ్ఐ రిఫ్రెష్మెంటు క్యాంపు

విశాలాంధ్ర - పద్మనాభం : భీమిలిలో వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్, భారత విద్యార్థి సమాఖ్య ఆధ్వర్యంలో పదవ తరగతి, ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థుల కోసం భీమిలిలో మూడు రోజులు పాటు శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఫంక్షన్ హాల్ లో రిఫ్రెష్మెంటు క్యాంపు జరిగింది. క్యాంపు నిర్వహణకు ఇచ్చినందుకు శ్రీ వాసవి ప్రార్థన మందిరం కమిటీకి ధన్యవాదములు తెలియ జేస్తున్నాము. మొదటి రోజు విద్యార్థులు వారి యొక్క భవిష్యత్తు ప్రణాళిక తో పాటు విద్యార్థులలో శాస్త్రీయ ఆలోచన పెంపొందించేందుకు చేయవలసిన కృషితో పాటుగా సమాజంలో వస్తున్న రకరకాల మార్పులు గురించి తెలియ జేయడం జరిగింది. రెండవ రోజు ప్రస్తుతం సమాజంలో కులం మతం వాటి ప్రభావం, విద్యార్థుల పై ప్రభావం అంశాలు చర్చించి కుల మతాలకు అతీతంగా సమాజంలో అందరూ సమానంగా ఉండడం కోసం కృషి చేయాలని కోరడం జరిగింది. అనంతరం విద్యార్థులకు సాంస్కృతిక కార్యక్రమాలు డ్యాన్స్, కోలాటం, పాటలు పై శిక్షణ ఇవ్వడం జరిగింది. వాటిని రెండవ రోజు భీమిలి బీచ్ లో ప్రదర్శించారు. మూడవ రోజు వాసవి కన్యకా పరమేశ్వరీ ఫంక్షన్ హాల్ ప్రెసిడెంట్ పూసర్ల శ్రీనివాస రావు, బొండా కిరణ్ విద్యార్థులను ఉద్దేశించి వారు చేసే సేవా కార్యక్రమాలను తెలియచేస్తూ ఈ విద్యార్థులు కూడా సేవా కార్యక్రమాలు చేపట్టాలని అందు కోసం బాగా చదువుకొని ప్రయోజకులు కావాలని కోరారు.

అధికారుల నిర్లక్ష్యం ... నిరుపేదలకు అష్ట కష్టాలు

దశాబ్ద కాలంగా కారు చీకట్లో అల్లాడుతున్న బర్దన్ నగర్ కాలనీ వాసులు

విశాలాంధ్ర - పెందుర్తి : పాలకుల నిర్లక్ష్యం జీవీఎంసీ 97వ వార్డు బర్దన్ నగర్ కాలనీ వాసులకు శాపంగా మారింది. కనీస వసతులైన తాగునీరు, కరెంటు, రోడ్లు, కాలువలు కల్పించాలంటూ అక్కడి ప్రజలు దశాబ్ద కాలంగా ప్రాధేయపడుతున్నా, రాజకీయ నాయకులు అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. దీంతో కనీస వసతులకు దూరమై కారు చీకట్లోనే వారంతా అల్లాడుతున్నారు. జీవీఎంసీ 97వ వార్డు టీచర్స్ లేఅవుట్ సమీపంలో పదేళ్ల నుండి సుమారు 120 కుటుంబాలు గుడిసెలు వేసుకొని జీవిస్తున్నారు. అప్పట్లో రెవిన్యూ అధికారులు వాటిని తొలగించదానికి ప్రయత్నించగా సిపిఐ నాయకులు వారికి అండగా నిలిచి హైకోర్టును ఆశ్రయించి రెవెన్యూ అధికారుల చర్యలను అడ్డుకున్నారు. అప్పటినుండి వారంతా అక్కడే నివాసం ఉంటున్నారు. తమ కాలనీకి కరెంటు రోడ్లు కాలువలు ఏర్పాటు చేయాలని అనేక మార్లు రాజకీయ నాయకులు అధికారులకు మొరపెట్టుకున్నా ఇప్పటివరకు ఎవ్వరూ స్పందించలేదు. దీంతో ప్రతిరోజు కిలోమీటర్ల దూరం నుండి నీరు తెచ్చుకొని వంటా వార్పు చేసుకుంటూ కిరోసిన్ దీపం వెలుగులోనే కాలం వెళ్లదీస్తున్నారు. పాములు తేళ్లు వంటి విష జంతువులతో సహవాసం సాగిస్తున్నారు. అంగన్వాడీ కేంద్రం పాఠశాల అందుబాటులో లేక తమ పిల్లల్ని చదువుకు దూరం చేసుకుంటున్నారు. గత ప్రభుత్వంలో వైఎస్ఆర్సిపి నాయకులు అదిగో ఇదిగో అంటూ కాలక్షేపం చేస్తూ వచ్చి చివరలో కేవలం రెండు తాగునీటి బోర్లను మాత్రం వేయించి చేతులు దులిపేసుకున్నారు. గత సార్వత్రిక ఎన్నికల సమయంలో ఎన్డీఏ కూటమి నాయకులు ఎన్నికల ప్రచారానికి వచ్చి తాము అధికారంలోకి వస్తే బర్దర్ నగర్ కాలనీకి అన్ని వసతులు కల్పిస్తామని హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకొస్తే తమ కష్టాలు గట్టెక్కుతాయని ఆశించిన బర్దన్ నగర్ కాలనీవాసులు కూటమి నాయకులకి ప్రత్యక్షంగానే మద్దతు పలికారు. ఎన్నికల్లో పెందుర్తి ఎమ్మెల్యేగా పంచకర్ల రమేష్ బాబు అనకాపల్లి ఎంపీగా సీఎం రమేష్ నాయుడు గెలుపొందడంతో తమ కష్టాలు గట్టెక్కుతాయని వారంతా సంబరపడిపోయారు. అయితే ఎన్నికలు జరిగి నెలలు గడుస్తున్నా బర్దన్ నగర్ కాలనీ వైపు అటు రాజకీయ నాయకులు గానీ ఇటు అధికారులు గానీ కన్నెత్తి కూడా చూడలేదు. దీంతో సిపిఐ ఆధ్వర్యంలో కాలనీవాసులు జిల్లా కలెక్టర్ ను కలిసి తమ కష్టాలను వివరించారు అలాగే పలు సందర్భాల్లో ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబుని కలిసి తమ అవస్థలను వివరించారు. దానిపై స్పందించిన ఎమ్మెల్యే త్వరలోనే బర్దన్ నగర్ కాలనీలో పర్యటించి అన్ని సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చినప్పటికి ఫలితం లేకపోయింది. ఎమ్మెల్యే హామీ హామీ నెలలు గడుస్తున్నా నేటికీ నెరవేరలేదని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్. శ్రీనివాసరావు, జిల్లా సమితి సభ్యులు వై. రాంబాబు, పెందుర్తి మండల శాఖ కార్యదర్శి అశిరినాయుడు, మహిళ నాయకురాలు అన్నపూర్ణ ఆవేదన వెలిబుచ్చారు. కాలనీకి చెందిన పలు కుటుంబాలు జీవీఎంసీకి ఏటా ఇంటి పన్నులు చెల్లిస్తున్నారని, పన్నులు వసూలు చేస్తున్న అధికారులు ఆ ప్రాంతానికి వసతులు కల్పించడంలో అలసత్వం చూపుతున్నారని మండిపడ్డారు. ప్రజాస్వామ్య దేశంలో పేదల కాలనీకి వసతులు కల్పించడం ప్రభుత్వాల కనీస బాధ్యత అని వారు గుర్తు చేశారు. ఎండకి ఎండుతూ వర్షానికి తడుస్తూ గుడిసెల్లో నివాసం ఉంటున్న పేదల బతుకులతో జీవీఎంసీ, రెవెన్యూ, విద్యుత్ శాఖ అధికారులు చెలగాట మాడుతున్నారని సీపీఐ నాయకులు ఆక్షేపించారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే రమేష్ బాబు, ఎంపీ సీఎం రమేష్ నాయుడు స్పందించి పేదల కష్టాలను గట్టెక్కించాలని, అలాగే అధికారులు తీరు మార్చుకుని బర్దన్ నగర్ కాలనీవాసుల బతుకులు మార్చాలని సిపిఐ నాయకులు డిమాండ్ చేసారు. అధికారులు అధికార పార్టీ నాయకులు మానవత్వంతో స్పందించి పేదలకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

పవన్ కళ్యాణ్ నిర్ణయమే శిరోధార్యం

విశాలాంధ్ర : విశాఖ సిటీ : నా అధ్యక్షులు పవన్ కళ్యాణ్ గారి నిర్ణయమే శిరోధార్యమని జనసేన పిఏసి సభ్యులు, గాజువాక ఇంచార్జ్ కొన్న తాతారావు అన్నారు. శుక్రవారం జనసేన పార్టీ నగర కార్యాలయంలో జనసేన కార్పొరేటర్లతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. త్వరలో కార్పొరేటర్లతో అధ్యక్షులు సమావేశమవుతారన్నారు. పవన్ కళ్యాణ్, నగర అధ్యక్షులు, సౌత్ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ఆదేశాలకు అనుగుణంగా జీవీఎంసీ కౌన్సిల్లో మా విధానం ఉంటుందని పేర్కొన్నారు. బిశెట్టి వసంత లక్ష్మి మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ మాట ప్రకారం మా కార్పొరేటర్లు నిలబడి ఉంటారన్నారు. జీవీఎంసీ కౌన్సిల్ అవిశ్వాసంపై బిన్న అభిప్రాయాలు లేకుండా ఒకే తాటిపై ఉంటామన్నారు. కౌన్సిల్లో జనసేన పార్టీ కార్పొరేటర్లు, ఎక్స్ఫిసియో మెంబర్లు కలిపి 14మంది ఉన్నామన్నారు. పీతల మూర్తి యాదవ్ మాట్లాడుతూ వైసిపి కబంధ హస్తాల్లో చిక్కున్న జీవీఎంసీని కాపాడే బాధ్యత కూటమి ప్రభుత్వంపై ఉందన్నారు. కందుల నాగరాజు మాట్లాడుతూ నగర పాలక సంస్థ ను అవినీతి తో నడిపిన వైసీపీ నాయకులు పై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. దోపిడి చేసి దోచుకున్న నాయకులు కు బుద్ధి చెప్పే శక్తి కూటమి ప్రభుత్వానికి ఉందన్నారు. కార్యక్రమంలో గోవిందరెడ్డి, ఉష శ్రీ, పూర్ణశ్రీ సురేష్, సాదిక్, సౌత్ నియోజకవర్గ పాయింట్ ఆఫ్ కాంటాక్ట్ శివ ప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు.

గెలాక్సీ ట్యాబ్ ఎస్ 10ఎఫ్ఈ సిరీస్‌ను విడుదల చేసిన సామ్‌సంగ్

విశాలాంధ్ర - విశాఖపట్నం : భారతదేశంలో అతిపెద్ద వినియోగదారు ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ అయిన సామ్‌సంగ్, నేడు గెలాక్సీ ట్యాబ్ ఎస్ 10ఎఫ్ఈ , గెలాక్సీ ట్యాబ్ ఎస్ 10ఎఫ్ఈ ప్లస్ లను విడుదల చేసినట్లు వెల్లడించింది. ఇది ప్రీమియం టాబ్లెట్ డిజైన్‌లో గెలాక్సీ పర్యావరణ వ్యవస్థకు సరికొత్త అంశాలను అందిస్తుంది. గెలాక్సీ ట్యాబ్ ఎస్ 10ఎఫ్ఈ సిరీస్‌లో ఇప్పటి వరకు అతిపెద్ద స్క్రీన్ మరియు దాని డిస్‌ప్లేను విస్తరించే స్లిమ్మర్ బెజెల్‌తో కూడిన గెలాక్సీ ట్యాబ్ ఎస్ 10ఎఫ్ఈ ప్లస్ వినోదం నుండి అధ్యయనం , రోజువారీ పనుల వరకు ప్రతిదానికీ ఆహ్లాదకరమైన, లీనమయ్యే వీక్షణ అనుభవాన్ని అందిస్తుంది. సామ్‌సంగ్ యొక్క తెలివైన లక్షణాలు వినియోగదారులను సుల భంగా మరిన్ని చేయడానికి శక్తినిస్తాయి, అయితే సన్నని డిజైన్ వినియోగదారులు ప్రయాణంలో సైతం తమ సృజనాత్మకత మరియు ఉత్పా దకతను సాధించడంలో సహాయపడుతుందని సామ్‌సంగ్ ఇండియా ఎంఎక్స్ బిజినెస్ వైస్ ప్రెసిడెంట్ ఆదిత్య బబ్బర్ అన్నారు.

భవిత కేంద్రాల ద్వారా చిన్నారులకు బంగారు భవిష్యత్తు : కలెక్టర్ హరేంధిర ప్రసాద్

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్ : అన్నిరకాల వసతులతో నిర్వహిస్తున్న భవిత కేంద్రాల ద్వారా ప్రత్యేక అవసరాలు గల చిన్నారులకు బంగారు భవిష్యత్తు లభిస్తుందని, సాధారణ పిల్లలకు ధీటుగా ఎదిగేందుకు పుష్కలమైన అవకాశాలు ఉంటాయని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా జిల్లాలోని 11 భవిత కేంద్రాల ద్వారా ప్రాథమిక, మాధ్యమిక స్థాయిలోని సుమారు 2,474 మంది చిన్నారులకు వివిధ రకాల సేవలందిస్తున్నామని గుర్తు చేశారు. సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ప్రత్యేక అవసరాల గల పిల్లలకు ఉపకరణాల పంపిణీ కార్యక్రమం జిల్లా పరిషత్ సమావేశం మందిరంలో శుక్రవారం ఉదయం జరిగింది. ముఖ్య అతిథిగా కలెక్టర్ హాజరై చిన్నారులకు ఉపకరణాలు అందజేశారు. కార్యక్రమంలో భాగంగా చిన్నారులను, వారి తల్లిదండ్రులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడారు. ఇతరులు ఏమనుకుంటారో అనే సంశయాన్ని విడనాడి ప్రత్యేక అవసరాలు గల పిల్లల్ని సమీపంలో ఉన్న భవిత కేంద్రాలకు పంపించాలని సూచించారు. అక్కడ సిబ్బంది వారికి అన్ని రకాలుగా తర్ఫీదు ఇస్తారని, సాధారణ పిల్లలకు దీటుగా ఎదిగేందుకు దోహదపడతారని పేర్కొన్నారు. అలింకో సంస్థ సహకారంతో ఈ విడతలో రూ.96.85 లక్షల వ్యయంతో సమకూర్చిన 106 రకాల వస్తువులను 160 మందికి అందజేస్తున్నామని, మలి విడతలో మిగిలిన వారికి అందజేస్తామని చెప్పారు. ప్రత్యేక అవసరాల గల పిల్లలకు జిల్లా యంత్రాంగం అన్ని విధాలుగా అండగా నిలుస్తుందని, ఎక్కడైనా సమస్యలున్నా, అవసరాలున్నా తమ దృష్టికి తీసుకురావాలని ఈ సందర్భంగా కలెక్టర్ పేర్కొన్నారు. తల్లిదండ్రులు పిల్లల భవిష్యత్తు విషయంలో కాస్త సమయం వెచ్చించాలని, ప్రత్యేక దృష్టి సారించాలని హితవు పలికారు. ఒకప్పటితో పోలిస్తే ఇప్పుడు తల్లిదండ్రల్లో చాలా మార్పు వచ్చిందని, ఇది చాలా శుభపరిణామని దానికి తగ్గట్లుగానే అధికార యంత్రాంగం తరఫున అన్ని రకాలుగా సహాయ, సహకారాలు అందిస్తామని పేర్కొన్నారు. సహిత విద్యను ప్రోత్సహించేందుకు గాను ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు 58 ట్యాబులు పంపిణీ చేశామని ఏపీసీ చంద్రశేఖర్ తెలిపారు. కార్యక్రమంలో భాగంగా పలువురు చిన్నారులకు కలెక్టర్ చేతుల మీదుగా ట్రైసైకిళ్లు, బ్యాటరీ వాహనాలు, వినికిడి యంత్రాలు, వాకింగ్ స్టిక్స్, రోలేటర్లు, వీల్ ఛైర్లు అందజేశారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఏపీసీ చంద్రశేఖర్ రావు, జిల్లా పరిషత్ సీఈవో నారాయణమూర్తి, జిల్లా ఐఈ కో-ఆర్డినేటర్ గీత, ఏపీఎం, సీఎంవో, ఇతర అధికారులు, ప్రత్యేక అవసరాలు గల చిన్నారుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

శంకర్ ఫౌండేషన్‌లో 8 నెలల చిన్నారికి గ్లకోమా శస్త్ర చికిత్స

విశాలాంధ్ర - పెందుర్తి : జీవీఎంసీ 93 వ వార్డు నాయుడు తోటలో గల శంకర ఫౌండేషన్ కంటి ఆసుపత్రిలో వైద్యులు 8 నెలల చిన్నారికి గ్లకోమా శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించి చూపు తీసుకొచ్చారని ఆ సంస్థ డిప్యూటీ జనరల్ మేనేజర్ (పి.ఆర్) కమెల్ల బంగారు రాజు ఓ ప్రకటనలో తెలియజేశారు. ఈ సందర్భంగా బంగార్రాజు మాట్లాడుతూ ప్రపంచ స్థాయి కంటి సంరక్షణను అందించే బృహత్కార్యంలో భాగంగా మరో అద్భుతమైన మైలురాయిని అదిగమించడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. సీనియర్ కంటి శస్త్రచికిత్స నిపుణుడు డాక్టర్ టి.రవీంద్ర బృందం నిర్వహించిన గ్లకోమా కంటి శస్త్రచికిత్స విజయవంతం కావడంతో ఎనిమిది నెలల గిరిజన శిశువుకు చూపు తిరిగి వచ్చిందని, ఈ సున్నితమైన, సంక్లిష్టమైన ప్రక్రియ శిశువు జీవితంలో కొత్త కాంతిని తీసుకువచ్చిందన్నారు. ఏఎస్ఆర్ జిల్లా అరకులోయ బట్టీవలస గ్రామంలో శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించగా చిన్నారి తల్లిదండ్రులు ఆమెను శిబిరానికి తీసుకువచ్చి చిన్నారి కుడి కంటిలో నిరంతరం నీరు కారతుందని వైద్యులకు వివరించారు. డాక్టర్ సమృద్ధి దేశ్ముఖ్ క్షుణ్ణంగా పరీక్షించి శిశువును ప్రత్యేక చికిత్స కోసం విశాఖపట్నంలోని ప్రధాన ఆసుపత్రికి రెఫర్ చేశారు. ఆసుపత్రిలో వివరణాత్మక మూల్యాంకనం తరువాత, వైద్య బృందం గ్లకోమాను పరిష్కరించడానికి శిశువు దృష్టి మరింత క్షీణించకుండా నిరోధించడానికి శస్త్రచికిత్స మాత్రమే మార్గమని సూచించి. డాక్టర్ టి.రవీంద్ర, డైరెక్టర్, సిక్యూఐ, రీసెర్చ్, హెచ్‌ఓడి, గ్లకోమా విభాగం, విజయవంతంగా ట్రాబెక్యులోటోమీ శస్త్రచికిత్సను నిర్వహించారని బంగార్రాజు తెలిపారు ఇది శిశువు దృష్టిని పునరుద్ధరించే కీలకమైన ప్రక్రియ. శస్త్రచికిత్స అనంతరం శిశువు దృష్టి పూర్తిగా పునరుద్ధరించబడిందని వైద్యులు ధృవీకరించినట్లు తెలిపారు. తమ చిన్నారి జీవితాన్ని మార్చే ప్రయత్నం చేసిన శంకర్ ఫౌండేషన్ వైద్యుల బృందానికి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ విజయం అత్యంత నిరుపేద మారుమూల కమ్యూనిటీలలో కూడా నాణ్యమైన కంటి సంరక్షణను అందించడంలో శంకర్ ఫౌండేషన్ యొక్క అచంచలమైన నిబద్ధతను నొక్కి చెబుతుందని వెల్లడించారు. శిశువు కంటిచూపును కాపాడిన వైద్యులను మేనేజింగ్ ట్రస్టీ ఎ.కృష్ణకుమార్, శంకర్ ఫౌండేషన్ జీఎం కె.రాధాకృష్ణన్ అభినందించారు.

ఏపీ ప్రభుత్వ సెర్ప్‌తో ఫ్లిప్‌కార్ట్ సమర్థ్ కృషి అవగాహన ఒప్పందం

విశాలాంధ్ర - విశాఖపట్నం : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సొసైటీ ఫర్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ రూరల్ పావర్టీ (సెర్ప్) సహకారంతో భారత దేశపు స్వదేశీ ఇ కామర్స్ మార్కెట్ ప్లేస్ అయిన ఫ్లిప్‌కార్ట్ ఫ్లిప్‌కార్ట్ సమర్థ్ కృషి కార్యక్రమం కింద ఒక వర్క్‌షాప్ నిర్వహించింది. ఈ మేరకు సెర్ప్ ఆంధ్రప్రదేశ్‌తో ఫ్లిప్‌కార్ట్ సమర్థ్ కృషి ఒక అవగాహన ఒప్పందం (ఎంఓయూ) చేసింది. ఫ్లిప్‌కార్ట్ గ్రూప్ చీఫ్ కార్పొరేట్ అఫైర్స్ ఆఫీసర్ రజనీష్ కుమార్ మాట్లాడుతూ ఈ సదస్సులో రైతు ఉత్పత్తిదారుల సంస్థలు (ఎఫ్ పీఓలు)కు అవసరమైన మార్కెట్ పరిజ్ఞానం, డిజిటల్ సాధనాలు వారి వ్యాపారాలను విస్తరింప చేయడానికి వ్యూహాలతో సన్నద్ధం చేయడంపై దృష్టి సారించిందన్నారు. ఫ్లిప్‌కార్ట్ ప్రైవేట్ లేబుల్ కిరాణా వ్యాపారానికి సోర్సింగ్ అవకాశాలను కూడా వర్క్‌షాప్ నొక్కి చెప్పిందన్నారు. దీని వలన రైతులు, వ్యవసాయ వ్యాపారాలు జాతీయ మార్కెట్ అవకాశాలను పొందగలుగుతాయని అన్నారు. ఈ భాగస్వామ్యం లో భాగంగా ఎంఎస్ఎంఈ లు, వ్యవసాయ వ్యాపారాలు, రైతు సంఘాలకు వ్యూహాత్మక మార్కెట్ అనుసంధానిత, ఇ కామర్స్ ఏకీకరణకు తోడ్పాటు అందించడం ద్వారా మద్దతు ఇస్తుందన్నారు. ఈ భాగస్వామ్యం రాష్ట్రంలోని చిన్న వ్యాపారాలు మరియు రైతులకు స్థిరమైన వృద్ధి, జీవనోపాధి కల్పన మరియు ఆర్థిక చేరికను అందించటం లక్ష్యంగా పెట్టుకుందన్నారు.

క్వాలిటీ వాల్ యొక్క కొత్త బ్రాండ్, గోల్డెన్ స్వూప్ ప్రారంభం

విశాలాంధ్ర - విశాఖపట్నం : విస్తరణకు గణనీయమైన అవకాశాలతో ఐస్ క్రీమ్ వర్గం భారతదేశంలో వేగంగా పెరుగుతోందని హెచ్ యూఎల్ బిజినెస్ హెడ్ టోలోయ్ టాద్రిడార్గీ అన్నారు. ఈ వర్గాన్ని అందరికీ ఆనందదాయకంగా మార్చాలనే ఆశయంతో, క్వాలిటీ వాల్ గోల్డెన్ స్వూప్ ను ప్రారంభించిందన్నారు. భారతదేశం డెజర్ట్‌లకు భారీ మార్కెట్ ఐస్ క్రీములు, స్తంభింపచేసిన డెజర్ట్‌ల వర్గం తక్కువగా ఉందని, పెరుగుతున్న కోల్డ్ చైన్ మౌలిక సదుపాయాలు ఇంటి రిఫ్రిజిరేటర్ చొచ్చుకుపోవటంతో, వృద్ధికి భారీ అవకాశం ఉందన్నారు. గోల్డెన్ చెంచా ద్వారా, క్వాలిటీ వాల్ ఈ సామర్థ్యాన్ని నొక్కడం, విభిన్న వేసవి ఆనందాలను ప్రవేశపెట్టడం ద్వారా విస్తృత వినియోగదారులతో కనెక్ట్ అవ్వడం లక్ష్యంగా పెట్టుకుందన్నారు.ఆల్ టైమ్ క్లాసిక్స్ నుండి బోల్డ్ ఇన్నోవేషన్స్ వరకు క్వాలిటీ వాల్ గోల్డెన్ స్వూప్ నాలుగు ఇర్రెసిస్టిబుల్ ఎంపికలను అందిస్తుందన్నారు. టైంలెస్ వనిల్లా, మిథాయ్ మ్యాజిక్, టు ఇన్ వన్ చాక్లెట్ వనిల్లా, మామిడి వనిల్లా ను అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. క్వాలిటీ వాల్‌కి బాలీవుడ్ ఐకాన్ బ్రాండ్ అంబాసిడర్ కాజోల్ నటించిన టివిసిని కూడా ప్రారంభించామన్నారు.

విశాఖలో ఘనంగా మధ్యప్రదేశ్ టూరిజం రోడ్ షో

విశాలాంధ్ర - విశాఖపట్నం : మధ్యప్రదేశ్ రాష్ట్ర టూరిజం శాఖ ఆధ్వర్యంలో మధ్యప్రదేశ్ టూరిజం రోడ్ షోను విశాఖ నగరంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మధ్యప్రదేశ్ టూరిజం బోర్డ్ డిప్యూటీ డైరెక్టర్ వివేక్ జూడే మీడియాతో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ కి చెందిన ట్రావెల్ ఏజెంట్లు, టూర్ ఆపరేటర్లు పర్యాటక నిపుణులు అందరూ కలిసి మధ్యప్రదేశ్ అందించే అద్భుతమైన అపరిమిత అవకాశాల గురించి చర్చించారన్నారు. పవిత్రమైన జ్యోతిర్లింగాలు, యునెస్కో వారసత్వ ప్రదేశాలు, టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ లాంటి అద్భుతమైన మధ్యప్రదేశ్ టూరిజం అందర్నీ ఆకర్షిస్తుందన్నారు. దక్షిణ భారతదేశ ప్రయాణికులకు మధ్యప్రదేశ్ ఒక అద్భుతమైన గమ్యస్థానం అన్నారు. ఆధ్యాత్మికం అయినా, ఉత్కంఠభరితమైన వన్యప్రాణుల ప్రాంతాలైనా, సాంస్కృతిక వారసత్వం అయినా లేదా సాహస పర్యాటకం అయినా, మధ్యప్రదేశ్ అనేది పూర్తి ప్రయాణ ప్యాకేజీ" అని అన్నారు. మధ్యప్రదేశ్ కనెక్టివిటీ, వసతి సౌకర్యాలు, పర్సనలైజ్డ్ ట్రావెల్ ప్లాన్స్, మధ్యప్రదేశ్ లో ఇప్పటివరకు ఎవ్వరికీ తెలియని సరికొత్త ప్రాంతాల గురించి వివరించారు. ప్రపంచ వారసత్వ ప్రదేశాలైన ఖజురహో, సాంచి బౌద్ధ స్థూపాలు, భీంబెట్కా యొక్క చరిత్రపూర్వ శిలా తదితర ఎన్నో ప్రదేశాలు మధ్యప్రదేశ్ లో చూడదగ్గవని చెప్పారు. 30 శాతం అటవీ విస్తీర్ణం, 12 జాతీయ ఉద్యానవనాలు, 9 టైగర్ రిజర్వ్‌లతో మధ్యప్రదేశ్ భారతదేశంలోని వన్యప్రాణుల గమ్యస్థానంగా ఉందని, అదనంగా, రాష్ట్రం మూడు బయోస్పియర్ రిజర్వ్ లకు నిలయంగా ఉందన్నారు. మహాకాళేశ్వర్, ఓంకారేశ్వర్ జ్యోతిర్లింగాలతో పాటు ఇతర తీర్థయాత్ర స్థలాలు కూడా ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో మధ్యప్రదేశ్ రాష్ట్ర టూరిజం బోర్డు చెందిన అధికారులు మనీష్ కౌశల్, వినోద్ జెట్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రంపాలెం జాతర గట్టు శ్రీదుర్గాలమ్మ అమ్మవారి ఆలయం వద్ద చలివేంద్రం ఏర్పాటు

విశాలాంధ్ర - కొమ్మాది : విశాఖపట్నం జిల్లా మధుర వాడ చంద్రం పాలెం జాతర గట్టు శ్రీ దుర్గాలమ్మ అమ్మవారి ఆలయం వద్ద ఆలయ కమిటీ ఆధ్వ ర్యంలో చలి వేంద్రం ఏర్పాటు చేయడం మజ్జిగ పంపిణీ చేయడం జరిగింది. ఆలయ ధర్మకర్త పిళ్లా చంద్రశేఖర్ ఆలయ కమిటీ అధ్యక్షులు పిళ్లా సూరిబాబు, ఆలయ అర్చకులు పట్నాల హరిప్రసాద్ శర్మ, చంద్రంపాలెం గ్రామ పెద్దలు పిళ్లా శ్రీనివాసరావు, రిటైర్డ్ ఎసిపి శ్యామలరావు, కమిటీ ఉపాధ్యక్షులు పి.వి.జి.అప్పారావు, సెక్రటరీ నాగోతి తాతారావు, సభ్యులు పిళ్లా వెంకటరమణ, బోగవిల్లి రాము, పొట్నూరి హరికృష్ణ, బంక వాసు, మరుపిల్లి ఆనంద్, జె.రామతీర్ధ ప్రసాద్, జగుపిల్లి అప్పారావు, జాయింట్ సెక్రటరీ పిళ్లా మోహన్ శివకృష్ణ, కమిటీ సభ్యులు పోతిన పైడిరాజు, పోతిన శివ, పిళ్లా రాజు, కేశనకుర్తి అప్పారావు, ముఖ్య సభ్యులు పిళ్లా పోతరాజు, పి.వెంకటరమణ, పిళ్లా అప్పన్న, జి.రామారావు, తదితరులు ప్రారంభించి భక్తులకు, పాదచారులకు, వాహనాల మీద ప్రయాణించే వాహన దారులకు మజ్జిగ పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఈ సంవత్సరం గత మార్చి నెల నుండి ఎండలు తీవ్ర స్థాయిలో పెరగడం వలన ఎండలో ప్రయాణం చేసే పాదచారులకు వాహనాల మీద ప్రయాణించే వాహన దారులకు, ఆలయానికి విచ్చేసిన భక్తులకు దాహార్తిని తీర్చేందుకు మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందని, గత కొన్నేళ్లుగా శ్రీ దుర్గాలమ్మ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, దాతలు సహాయ సహకారాలతో చలివేంద్రం ఏర్పాటు చేస్తున్నామని, వారానికి కనీసం రెండు సార్లు మజ్జిగ పంపిణీ ఉంటుందని మిగతా రోజుల్లో పరిశుభ్రమైన చల్లని నీరు కుండలలో ఉంచి పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. శ్రీదుర్గాలమ్మ అమ్మవారి ఆలయంలో అమ్మవారికి ఉదయం నిత్య పూజలతో ప్రారంభమై భక్తుల గోత్ర నామాలతో కుంకుమార్చనలు పుష్పార్చనలు మొదలగు పూజా కార్యక్రమాలు ఆలయ అర్చకులు పట్నాల హరిప్రసాద్, శర్మ మూర్తి శర్మలు తదితరులు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. సాయంత్రం వేళలో అమ్మవారికి పంచామృత సుగంధ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించి ప్రత్యేకంగా అమ్మవారిని అలంకరించి కుంకుమార్చనలు పుష్పార్చనలు మొదలగు పూజా కార్యక్రమాలు నిర్వహించి నైవేద్యాలు సమర్పించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు, ఆలయంలో మహిళా భక్తులు ఎక్కువగా పాల్గొని దీపాలు వెలిగించారు, ఈ సందర్భంగా మధురవాడ మిథిలాపురి ఉడా కోలని వాస్తవ్యులు శ్రీనివాసన్, ఈశో గారి కుటుంబ సభ్యుల సహాయ సహకారాలతో పులిహోర ప్రసాదం ఏర్పాటు చేయగా అమ్మవారికి నివేదించి అనంతరం భక్తులకు పంపిణీ చేయడం జరిగింది.

కేసుల్లో పట్టుబడిన మద్యం బాటిల్స్ నాటు సారా ధ్వంసం

విశాలాంధ్ర - అనందపురం : అనందపురం పోలీస్ స్టేషన్ పరిధిలో 2020 - 24 సంవత్సరంలో వివిధ కేసుల్లో పట్టుబడిన మద్యం బాటిల్స్ , నాటు సారా,ను శుక్రవారం ఏపీ ప్రొఫెషన్ అండ్ ఎక్సైజ్ డిపార్ట్మెంట్ అసిస్టెంట్ ఎక్సైజ్ సూపర్నెంట్ బి .ఈశ్వరరావు, సిబ్బంది ఆధ్వర్యంలో ఆనందపురం పోలీసులు ధ్వంసం చేశారు. 2020 సంవత్సరం నుంచి 2024 కాలంలో 44 కేసుల్లో పట్టుకున్న లిక్కర్ బాటిల్స్ ను 2 కేసులలో సీజ్ చేసిన నాటుసార మొత్తంగా 180 ఎంఎల్ బాటిల్స్ 1728, 32 లీటర్ల సారాను ఈ మొత్తాన్ని ఎక్సైజ్ అసిస్టెంట్ సూపర్నెంట్ బి .ఈశ్వరరావు,సిబ్బంది, సిఐ వాసు నాయుడు, విఆర్ఓ వరహాలు సహాయంతో పంచనామా నిర్వహించి మద్యం బాటిల్స్ లో ఉన్న లిక్కర్ కాలువలో పారబోశారు.

అప్పన్న కళ్యాణానికి ఎమ్మెల్యే గణబాబుకు ఆహ్వానం

విశాలాంధ్ర - గోపాలపట్నం : ఈ నెల 8వ తేదీన జరగనున్న సింహాచలం శ్రీ వరాహ నరసింహ స్వామి వార్షిక కళ్యాణ మహోత్సవం అలాగే 30వ తేదీన జరగనున్న స్వామి వారి చందనోత్సవం (నిజరూప దర్శనం) ఉత్సవాలకి పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే మరియు ప్రభుత్వ విప్ గణబాబును ఆహ్వానించారు సింహాచలం దేవస్థానం ఏఈఓ ఆనంద్ కుమార్. స్వామివారి కల్యాణ మహోత్స వానికి, అలాగే స్వామివారి చందనోత్సవానికి కూడా తప్పక హాజరవుతానని స్వామివారి సేవలో నేను భాగస్వామి అవుతానని ఎమ్మెల్యే తెలియజేశారు.

రాములోరి పెళ్లికి ఉడుపు రాట

6న శ్రీరామ నవమి సందర్భంగా కల్యాణ మహోత్సవం

శ్రీ విజయ దుర్గాదేవి ఆలయ ప్రాంగణంలో వెల్లివిరిసిన ఆధ్యాత్మిక శోభ

విశాలాంధ్ర - కొమ్మాది : విశాఖ నగరంలోని మధురవాడ, టైలర్స్ కాలనీలో వేంచేసి ఉన్న శ్రీ విజయ దుర్గాదేవి ఆలయ ప్రాంగణంలో శ్రీరామనవమి ఉడుపు రాట మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త బంగారు లక్ష్మి, ధర్మకర్త మండలి సభ్యులు బంగారు ప్రకాష్, టెంటు మాధవి ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు శ్రీకాంత్ శర్మ మంత్రోచ్చారణ,మంగళ వాయిద్యాల మధ్య ఉడుపురాట కార్యక్రమాన్ని శోభాయమానంగా నిర్వహించారు.. ముందుగా ఆలయ ధర్మ కర్త మండల సభ్యులు బంగారు అశోక్ కుమార్, ఝాన్సీ దంపతులు అలాగే వంకాయల సాయి కుమార్ దంపతులకు కంకణాలు కట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం పసుపు రాసి కుంకుమ బొట్లు పెట్టి పూలతో అలంకరించిన ఉడుపు రాటను వేశారు. అంతట శ్రీసీతారాముల వారి నామస్మరణతో ఆ ప్రాంగణం మారుమ్రోగింది. అనంతరం భక్తులకు తాంబూలాలు, తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త బంగారు లక్ష్మి మాట్లాడుతూ ప్రతి ఏడాది మాదిరిగానే ఈ సంవత్సరం కూడా శ్రీ విజయ దుర్గా దేవి ఆలయ ప్రాంగణంలో శ్రీ సీతారాముల కల్యాణాన్ని ఏప్రిల్ 6న అంగరంగ వైభవంగా నిర్వహించడానికి అన్ని రకాల ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈ కళ్యాణ మహోత్సవంలో భక్తులందరూ పాల్గొని రాములోరిని దర్శించుకుని తరించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు పోతిన శ్రీనివాసరావు, వంకాయల మారుతి ప్రసాద్, బొట్టా అప్పలరాజు, వట్టికుల నాగమ్మ, పసుపులేటి గోపి, రజని, పాపారావు, నారాయణమ్మ, మీడియా ప్రతినిధులు బి.ఆనందరావు, ఆర్. హరినాథ్ దాస్ అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఎంపీపీ స్కూలు భోజనశాల భవనం ప్రారంభోత్సవం

విశాలాంధ్ర.. గోపాలపట్నం : విశాఖపట్నం పశ్చిమ నియోజకవర్గం గోపాలపట్నం ఇందిర నగర్ మండల పరిషత్ పాఠశాల నందు నూతనంగా నిర్మించిన వంటశాల మరియు భోజనశాల భవనాన్ని పశ్చిమ నియోజకవర్గం శాసనసభ్యులు, గవర్నమెంట్ విప్ గణబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గణబాబు మాట్లాడుతూ పాఠశాలకు సంబంధించి విద్యార్థులకు భోజనాన్ని అందించే వంటశాల మరియు భోజనశాల సమస్యను అధికారులు మా దృష్టికి తీసుకురావటం అది త్వరితగతిన పూర్తి చేయడం చాలా ఆనందదాయకం అన్నారు అలాగే పాఠశాలకు అవసరమైన మరిన్ని వసతులను త్వరలోనే సమకూరుస్తామని హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులకు భోజన ప్లేట్లు, వాటర్ బాటిళ్లను అందజేశారు అలాగే వివిధ క్రీడల్లో పాల్గొనీ గెలుపొందిన విద్యార్థులకు బహుతులును గణబాబు గారి చేతుల మీదగా బహుకరించారు.

ఘనంగా శ్రీ కరకచెట్టు పోలమాంబ అమ్మవారి రాట మహోత్సవం

విశాలాంధ్ర - విశాఖపట్నం : పెదవాల్తేరులోని శ్రీ కరక చెట్టు పోలమాంబ అమ్మవారి వార్షిక జాతర మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం పందిరిరాట మహోత్సవం ఘనంగా జరిగింది. ముందుగా రాటతో దేవస్థానం చుట్టూ మూడు సార్లు ప్రదక్షిణ చేశారు. ఆ తరువాత వేద మంత్రాలు, మంగళవాయిద్యాల మధ్య రాట వేశారు. శ్రీ అమ్మవారి వార్షిక జాతర శుక్రవారం నుండి మే ఆరవ తేదీ వరకు నేత్రపర్వంగా జరుగుతుంది. ఈ నెల 6 తేదీన పండుగ చాటింపు, 7న శ్రీ అమ్మవారి దేవర పండుగ(పుట్టబంగారం) 14న తోలేళ్ల ఉత్సవం, 15న అనుపు ఉత్సవం 22న మారువారం పండుగ జరుగుతుంది. 26వ తేదీన మహా అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తారు.శ్రీ అమ్మవారి జాతర ఉత్సవాలను అత్యంత వైభవం నిర్వహిస్తామని రాట ఉత్సవంలో పాల్గొన్న దేవదాయ ధర్మాదాయ శాఖ సహాయ కమిషనర్ అన్నపూర్ణ,ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కె.గాయత్రి తెలిపారు.శుక్రవారం వారు మీడియాతో మాట్లాడుతూ ఉత్సవాల సందర్భంగా ఆలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరిస్తున్నామని భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని, ఎండలు దృష్ట్యా త్రాగునీరు మజ్జిగ వంటివి పంపిణీ చేస్తామని తెలిపారు. ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, స్థానికుల సహకారంతో ఉత్సవాలు జయప్రదం చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలియజేశారు ముఖ్యంగా ఈ నెల 15వ తేదీన అనుపు ఉత్సవం సందర్భంగా భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకొని దేవస్థానం సకల ఏర్పాట్లు చేస్తోందని భక్తులకు ప్రత్యేక క్యూ లైన్లు ఏర్పాటు చేస్తున్నామని వృద్దులు, పిల్లలకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. 14గ్రామాల ఆరాధ్య దైవం శ్రీ పోలమాంబ అమ్మవారి ఉత్సవాలను నేత్రపర్వంగా నిర్వహిస్తామని ఈఓ కె.గాయత్రి పేర్కొన్నారు. 14వ తేదీ సోమవారం రాత్రి 10గంటల నుండి శ్రీ అమ్మవారికి తొలి పూజ జరుగుతుందని ఈ పూజలో పాల్గొనే భక్తులు దేవస్థానంలో రెండు వేల రూపాయలు చెల్లించాలని చెప్పారు. ఉత్సవాల సందర్భంగా రెవిన్యూ, పోలీస్, ఇతర విభాగాల సహకారం తీసుకొంటున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఉత్సవాల కరపత్రంను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం లో కార్పొరేటర్లు పెద్దిరాజు,పీతల మూర్తి యాదవ్, స్థానిక నాయకులు బైరెడ్డి పోతన్న రెడ్డి, మరడ శ్రీనివాసరెడ్డి, దేవస్థానం అర్చకులు, సిబ్బంది, స్థానిక భక్తులు తదితరులు పాల్గొన్నారు.

సామాన్యుని వరించిన ఏఎంసీ ఛైర్మన్ పదవి

విశాలాంధ్ర - పద్మనాభం : పద్మనాభం మండలం కు చెందిన జనసేన పార్టీ మండల అధ్యక్షుడు కురిమిన రామస్వామి నాయుడుకు భీమిలి మార్కెటింగ్ చైర్మన్గా ఎన్నికైనట్లు కూటమి ప్రభుత్వం ప్రకటించిన జాబితాలో ఆయన పేరు ఉండటం మండలంలోని జనసేన నాయకులు, కూటమి పార్టీ నాయకులు, స్థానిక గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ ఆనందాన్ని తెలియ పరిచారు. పద్మనాభం మండలం అయినాడు గ్రామానికి చెందిన ఒక సామాన్య జనసేన కార్యకర్త అయినటువంటి కురిమిన రామస్వామి నాయుడు పార్టీ పట్ల ఎంతో నిజాయతితో ఉంటూ పార్టీ కోసం అహర్నిశలు శ్రమించటం పార్టీ రామస్వామి నాయుడు గుర్తించి మొదట మండల పార్టీ అధ్యక్షుడిగా,. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రామస్వామి నాయుడు ని గుర్తించి కూటమి ప్రభుత్వం శుక్రవారం ప్రకటించిన మార్కెటింగ్ చైర్మన్ జాబితాలో భీమిలి మార్కెటింగ్ చైర్మన్గా అతనికి పదవి వరించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓ సామాన్య కార్యకర్త అయిన నన్ను గుర్తించి జనసేన మండల అధ్యక్షుడిగా, ఇప్పుడు ఏఎంసీ చైర్మన్గా పదవి ఇవ్వడం ఎంతో ఆనంద కరంగా ఉందని నాకు మరింత బాధ్యత పెరిగిందని ఆయన తెలియజేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు, జనసేన అధినేత ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు, స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుకు, జనసేన భీమిలి నియోజకవర్గం ఇన్చార్జి పంచకర్ల సందీప్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు.

సింహాద్రి నాధుని సన్నిధిలో ఏప్రిల్‌లో జరుగు ఉత్సవాలు

విశాలాంధ్ర - సింహాచలం : శ్రీ శ్రీశ్రీ వరహ లక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానం సింహాచలం లో2025 ఏప్రియల్ నెలలో జరుగు ఉత్సవములు. స్వర్ణ పుష్పార్చనం, రోహిణీ శ్రీ అష్టాక్షరీ హవనం (మాధవధార శ్రీ వేణుగోపాల స్వామి ఆలయంలో) శుక్రవారం శ్రీ తాయార్ల సన్నిధిని సహస్ర నామార్చనం, బేడా తిరువీధి జరిగింది. నేడు ఎంబెరుమానార్ మాస తిరునక్షత్రం. 06 వ తేదీన శ్రీరామ నవమి, భద్రాచలం శ్రీ సీతారాముల వార్షిక తిరు కళ్యాణం, స్వర్ణ పుష్పార్చనం, పునర్వసు - శ్రీరామ పట్టాభిషేక సర్గ విన్నపం. 07వ సోమవారం-శ్రీ స్వామివారి వార్షిక తిరు కళ్యాణోత్సవం ప్రారంభం, మృత్సంగ్రహణం, అంకురారోపణం. 08వ తేదీ మంగళవారం-విష్ణు డోలోత్సవం, సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీ నరసింహస్వామి వారి వార్షిక తిరు కళ్యాణం, శ్రీ శ్రీ శ్రీ వరాహ లక్ష్మీ నృసింహ స్వామివారి వార్షిక తిరుకళ్యాణ మహోత్సవ ప్రయుక్తంగా కొట్నాల ఉత్సవం, ధ్వజారోహణం, ఎదురు సన్నాహం. రథోత్సవం. శ్రీ స్వామి వారి తిరుకళ్యాణోత్సవం.10 వ తేదీ గురువారం స్వర్ణ పుష్పార్చనం రద్దు, ఉదయం వైదిక సదస్యం- సాయంత్రం పండిత సదస్యం - సర్వజన మనోరంజని వాహనంపై గ్రామ తిరువీధి. పుబ్బ- శ్రీ ఆండాళ్ మాస తిరునక్షత్రం. తేది: 11వ తేది శుక్రవారం - శ్రీ తాయార్ల సన్నిధిని సహస్ర నామార్చనం. పుబ్బ -శ్రీ ఆండాళ్ మాస తిరునక్షత్రం. శ్రీ స్వామి వారి మాస జయంతి. సూర్య ప్రభ వాహనంపై తిరువీధి.12వ తేదీ స్థిరవారం- చైత్ర పూర్ణిమ-పూర్ణాహుతి, అవబృదం, చూర్ణోత్సవం, వసంతోత్సవములు, రాత్రి మృగయోత్సవం దొంగల దోపు ఉత్సవం.13వ తేదీ ఆదివారం స్వర్ణ పుష్పార్చనం రద్దు. శ్రీ స్వామివారి వినోదోత్సవం (ఉంగరపు సేవ) శ్రీ పుష్ప యాగం. 14వ తేదీ సోమవారం మేష సంక్రమణం ఉ :05-30. తమిళ సంవత్సరాది.15వ మంగళవారం- విశాఖ శ్రీ నమ్మాళ్వార్ మాస తిరునక్షత్రం. 17వ తేది గురువారం స్వర్ణ పుష్పార్చనం, 18వ తేదీ శుక్రవారం శ్రీ తాయార్ల సన్నిధిని సహస్ర నామార్చనం. మూల మణవాళ మహామునుల మాస తిరునక్షత్రం. 20వ తేది ఆదివారం స్వర్ణ పుష్పార్చన. 22వ తేదీ మంగళవారం- శ్రవణం - శ్రీ సుదర్శన హెూమం (కొండ దిగువన శ్రీ వేంకటేశ్వర స్వామివారి దేవాలయం నందు). 24వ తేదీ గురువారం- చైత్ర బహుళ ఏకాదశీ, చందనం స్థాన ముహూర్తం. 25వ తేది శుక్రవారం - శ్రీ తాయార్ల సన్నిధిని సహస్ర నామార్చనం. 27వ తేదీ ఆదివారం-చైత్ర బహుళ అమావాస్య, గ్రామ బలిహరణం. గంధం అమావాస్య, 28వ తేదీ సోమవారం- శ్రీ భగవద్రామానుజులు తిరు నక్షత్రం తొళక్కం (ప్రారంభం). తేది:29వ తేదీ మంగళవారం- మూర్తి కళావాహనం. 30వ తేద బుధవారం శ్రీ వరాహ లక్ష్మీ నృసింహ స్వామివారి చందనోత్సవం - నిజరూప దర్శనం-అక్షయ తృతీయ, రాత్రి సహస్ర ఘటాభిషేకం, మొదటి విడత చందన సమర్పణం. (రోహిణీ శ్రీ అష్టాక్షరీ హవనం. మాధవధార శ్రీ వేణుగోపాల స్వామి ఆలయంలో రద్దు చేయబడినది) అని ఇంచార్జ్ కార్యనిర్వహణాధికారి కె.సుబ్బారావు, ప్రధాన అర్చకులు శ్రీనివాసాచార్యులు, స్థాన చార్యులు డాక్టర్ రాజగోపాల్ తెలిపారు.